సాక్షి
జగిత్యాల
బుధవారం ౹ 29 ౹ మార్చి ౹ 2023



కొండంత రద్దీ

కొండగట్టు : శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. క్యూలైన్ ద్వారా అంజన్నను దర్శించుకున్నారు.



బద్దిపోచమ్మకు మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
37.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండ తీవ్రంగా ఉంటుంది.

రమజాన్ అంటే స్నేహం. నేనున్నానని చెప్పడం, నువ్వున్నావని గుర్తుచేసుకోవడం.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6.32	గురు 4.47

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ముస్తాబైన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం



శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలు

మల్లాపూర్(కోరుట్ల): వాల్గొండ గోదావరి నదీ తీరంలో కొలువైన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం నుంచి రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 30న శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిపిస్తారు. మల్లాపూర్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారని, వారికి అవసరమైన అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని ఆల య కమిటీ, సర్పంచ్ దండిక గంగురాజన్న, ఎంపీటీసీ ఇస్లావత్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ జీర్ణోద్ధరణకు పూనుకోవడం సంతోషకరం



ఆలయంలో దేవనాథ జీయర్‌స్వామీజీ

సారంగాపూర్(జగిత్యాల): పురాతన ఆలయ జీర్ణోద్ధరణకు పూనుకోవడం సంతోషంగా ఉందని త్రిదండి శ్రీదేవనాథ జీయర్‌స్వామీజీ అన్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్ అతిపురాతన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శాంతిపూజలు, హోమం, యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్వామీజీ హాజరయ్యారు. ఆలయ జీర్ణోద్ధరణకు పూనుకున్న ఓగుల అజయ్–అనిలాను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్షా స్వాములు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాలు ఉండాలి



ఫైర్‌సేఫ్టీ పరికరాలు పరిశీలిస్తున్న కొమురయ్య

రాయికల్(జగిత్యాల): మున్సిపల్ పరిధిలోని షాపింగ్‌మాల్స్, పెట్రోల్‌బంక్, రెస్టారెంట్స్, స్కూళ్లతోపాటు దుకాణాల్లో అగ్నిమాపక(ఫైర్ సేఫ్టీ) పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి కొమురయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ ఆయన చేశారు. వ్యాపారులు తప్పనిసరిగా ఎన్‌వోసీ తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్, అగ్నిమాపక సిబ్బంది నరేశ్, మున్సిపల్ మేనేజర్ వెంకట్, జూనియర్ అసిస్టెంట్ హరీశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించాలి



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకోవడమే కాకుండా దానిని వినియోగించుకోవాలని స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ హరిణి సూచించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులతో కలిసి మంగళవారం పెగ్గెర్ల గ్రామంలో ఆమె పర్యటించారు. పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. మరుగుదొడ్ల అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, ఏపీవో రాజేందర్ పాల్గొన్నారు.

జోరుగా రియల్ దందా!

“ కోరుట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ సుమారు 10–15 రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. ఇందులో కోరుట్ల మున్సిపల్ పరిధిలోనే ఐదారు రిజిస్ట్రేషన్లు ఉంటాయి. ఈ లెక్కన కోరుట్ల మున్సిపల్‌గా ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటిదాకా వేలాది ప్లాట్లు రిజిస్ట్రేషన్లు జరిగి ఉంటాయి.

“ కోరుట్ల మున్సిపాలిటీగా ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు మూడు ప్రాంతాల్లోనే లే అవుట్‌లకు అనుమతి తీసుకున్న స్థలాలు ఉన్నాయి. అందులో 150 నుంచి 200 ప్లాట్లకు మించవు. మిగతావి లేఅవుట్ లేకుండా సాగాయనే ఆరోపణలు ఉన్నాయి.



కోరుట్ల పట్టణ శివారులోని కల్లూర్ రోడ్డులో వెంచర్‌గా మార్చుతున్న స్థలం

- నిబంధనలు అతిక్రమిస్తూ వెంచర్ల ఏర్పాటు
- అనుమతిలేకుండా ప్లాట్ల విక్రయాలు
- హద్దురాళ్లు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు
- అయినా, ఆగని అక్రమ వ్యాపారాలు
- కోరుట్ల బల్దియా పరిధిలో దందా

కోరుట్ల: కోరుట్ల పురపాలక సంఘంగా ఆవిర్భవించి దాదాపు 35ఏళ్లు గడుస్తోంది. ఇప్పటివరకు నాలుగు మున్సిపల్ పాలకవర్గాలు మారిపోయాయి. ప్రస్తుతం ఐదో పాలకవర్గం కొనసాగుతోంది. ఈ మధ్యకాలంలో కేవలం మూడుచోట్ల మాత్రమే లే అవుట్ అనుమతులు తీసుకున్న స్థలాలు ఉన్నాయంటే అతిశయోక్తికాదు. వీటిలో ఒకటి ఆదర్శనగర్ ఏరియా, మరొకటి వెంకటసాయినగర్, మూడోది సాయిబాబా దేవాలయం సమీపంలోనిది. చివరగా మరోచోట లేఅవుట్ అనుమతి కోసం వ్యాపారులు దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఇవి మినహాయిస్తే ఎక్కడా లే అవుట్ నిబంధనల ప్రకారం ప్లాట్లు చేసిన దాఖలాలు లేవు. నిబంధనల ప్రకారం లేఅవుట్ స్థలంలో పదిశాతం మున్సిపాల్టీకి, రహదారులు, వీధిదీపాలు, డ్రైనేజీల అభివృద్ధి, నాలా కన్వర్షన్ ఫీజు వంటివాటికి చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం టీఎస్ బీపాస్ ద్వారా లే అవుట్ అనుమతులు పొందడం సులభతరమైనా.. అధికార యంత్రాంగం నిక్కచ్చిగా వ్యవహరించకపోవడంతో లే అవుట్ అనుమతుల కోసం వ్యాపారులు ఎవరూ దరఖాస్తు చేసుకోవడం లేదు.

హద్దురాళ్ల తొలగింపుతో సరి..

- పట్టణ శివారులోని కాలనీల్లో ప్రతీమూడు నెలలకోసారి లేఅవుట్ అనుమతులు లేకుండా ప్లాట్లు అమ్ముతున్న స్థలాలను గుర్తించి టౌన్‌ప్లానింగ్ అధికారులు హద్దురాళ్లు తొలగిస్తున్నారు.
- అనంతరం ఆ స్థలాల్లో మళ్లీ ఏం జరుగుతుందన్న విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదు.
- ఇటీవల కల్లూర్‌రోడ్డు, ఆదర్శనగర్, ఐలాపూర్ రోడ్డు, జగిత్యాల రోడ్డు, మెట్‌పల్లి రోడ్డు, హాజీపురా, నద్దినాలా ఏరియాల్లోని అనుమతి లేని ప్లాట్లను మున్సిపల్ అధికారులు గుర్తించారు.
- 326, 327, 940, 458, 451, 452, 453, 1284, 1463, 782, 783, 790 సర్వే నంబర్లలోని స్థలాల్లో హద్దురాళ్లు తొలగించారు.
- ఓసారి హద్దురాళ్లు తొలగించినప్పటికీ నిబంధనల అమలుపై ఆసక్తిలేని రియల్టర్లు.. మున్సిపల్ నిబంధనల ప్రకారం 30 ఫీట్లు రోడ్లు నిర్మించకుండా తమకు నచ్చినట్లు 18, 24 ఫీట్ల రోడ్లతో అడ్డగోలుగా ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నారు.
- కేవలం నాలా కన్వర్షన్ ఫీజు చెల్లించి ప్లాట్ల విక్రయాలు సాగిస్తున్నారు.
- లే అవుట్ అనుమతులు లేనిస్థలాల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేయవద్దన్న నిబంధనలు ఉన్నా.. చిన్న లొసుగులను ఆధారంగా చేసుకుని ప్లాట్లు విక్రయిస్తూ రిజిస్ట్రేషన్లు చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారు.
- ఫలితంగా కోరుట్ల మున్సిపాల్టీ పరిధిలోని కొత్తకాలనీలు అసౌకర్యాలకు నిలయంగా మారుతున్నాయి.
- తద్వారా జనం ఇబ్బందులపాలు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

నిబంధనలు అమలు చేస్తున్నాం

మున్సిపల్ పరిధిలో లే అవుట్ నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తున్నాం. లే అవుట్ లేనిస్థలాలను గుర్తించి హద్దురాళ్లు తొలగిస్తున్నాం. ప్లాట్లు విక్రయిస్తున్న వ్యాపారులకు నోటీసులు జారీచేస్తున్నాం. లే అవుట్ అమలు చేసిన స్థలాల్లో ప్లాట్లు కొనుగోలు చేస్తే కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అనుమతి లేనిస్థలాల్లో ప్లాట్లు కొనవద్దని ప్రచారం చేస్తున్నాం.
– శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్

పంచాయతీరాజ్‌లో టీఎస్‌పీఎస్‌సీ తరహా కుంభకోణం

- 1988లో కట్టా చేరే సమయంలో ఫోర్జరీ సంతకాలు
- సర్వీస్ రికార్డులో ఒక్కో పేజీకి ఒక్కో అధికారి సంతకం
- అంతర్గత సిబ్బందే అతనికి సాయం చేశారని సందేహాలు
- తప్పుడు విధానంలో చేరారంటూ నిగ్గుతేల్చిన నివేదిక
- త్వరలోనే వేటు ఖాయమంటున్న సహోద్యోగులు




విష్ణువర్ధన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కట్టా విష్ణువర్ధన్ అలియాస్ వాసు.. పంచాయతీరాజ్ విభాగంలో ప్రస్తుతం ఏఈగా కొనసాగుతున్న ఈ ఉద్యోగి నియామకం, విద్యార్హతల విషయంలో ఆయన అందరినీ తప్పుదోవ పట్టించారని ఇంతకాలం అనుకున్నారు. కానీ.. అతని సర్వీసు రికార్డులు చూస్తే.. కట్టా విష్ణువర్ధన్ ఇదంతా బయట నుంచి ఒక్కరే చేయలేదనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీల తరహాలోనే అతనికి పంచాయతీరాజ్ విభాగంలోని కొందరు సిబ్బంది సహకరించారన్న విషయం సర్వీసు రికార్డు చూస్తే అర్థం అవుతోంది. నేటి హైటెక్ యుగంలో ఉద్యోగ నియామకాల్లో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. కానీ.. ఎలాంటి టెక్నాలజీ లేని రోజుల్లోనే కట్టా విష్ణువర్ధన్ చాలా తెలివిగా తన సర్వీసు రికార్డులో అధికారుల సంతకాల ఫోర్జరీకి వ్యూహం రచించారని అతని సహోద్యోగులు కొత్త సందేహాలను లేవనెత్తుతున్నారు.

ఏం జరిగింది?

కట్టా విష్ణువర్ధన్ ఉరఫ్ వాసు వివాదం మరోసారి వార్తల్లోకెక్కింది. పంచాయతీ రాజ్ విభాగం వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ సబ్–డివిజన్, ఏఈ, విష్ణువర్ధన్ మార్చి2, 1967లో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో తండ్రి వెంకట నాగరత్నాచారి మరణించారు. తన తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ ఫిబ్రవరి 01, 1956గా ఉంది. విచిత్రంగా విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో మార్చి 2, 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. తల్లి కంటే కేవలం పదేళ్లు చిన్నవాడైన ఉద్యోగిగా అరుదైన రికార్డును తనపేరిట లిఖించుకున్నాడు. అదే సమయంలో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో చేరారు. ఈ విషయం తన సర్వీసు రికార్డులోని అతని చేరికను ధ్రువీకరిస్తూ అతనిపై అధికారి తొలిపేజీలో చేసిన సంతకాన్ని చూసి చెప్పొచ్చు. రెండోపేజీలోనూ అదే అధికారి సంతకం ఉండాలి. కానీ, మరో సబ్ డివిజన్ సుల్తానాబాద్‌కు చెందిన డీఈ సంతకం ఉండటంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. నిబంధనల ప్రకారం.. రెండు పేజీల్లోనూ ఒకే అధికారి సంతకం, స్టాంప్ ఉండాలి. ఇక్కడ వేర్వేరు సబ్‌డివిజన్లకు చెందిన డీఈల సంతకాలు ఉన్నాయి. దీన్ని ఉన్నతాధికారులు ఎలా ఆమోదించారో అని మిగిలిన సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారు.

పట్టుకోండి చూద్దాం పార్ట్ 6



ఎస్‌ఆర్‌లో ఫోర్జరీగా చెబుతున్న సంతకం

రెండు సంతకాలు, రెండు స్టాంపులు..

- ఇక్కడ మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. రెండో పేజీలో డీఈ రవికుమార్ సంతకం, సుల్తానాబాద్ సబ్ డివిజన్ స్టాంప్ ఉంది. అదే సమయంలో మరో అధికారి సంతకం, జగిత్యాల సబ్‌డివిజన్ స్టాంప్ ఉంది. ఇంకా పరిశీలించి చూస్తే.. వీటి అడుగున వేములవాడ సబ్ డివిజన్ స్టాంప్ కూడా ఉంది. మొత్తానికి రెండు సంతకాలు మూడు స్టాంపులతో రెండో పేజీని అత్యంత గందరగోళంగా ఉంది. ఈ లెక్కన చూస్తుంటే.. ఈ సంతకాలను ఫోర్జరీ చేసి ఉంటారని, దీనికి సూత్రధారి విష్ణువర్ధన్ అయి ఉంటాడని సహోద్యోగులు అనుమానిస్తున్నారు. తప్పుడు దారిలో కొలువు సాధించి, అనుమానాస్పద విద్యార్హతలతో ఉద్యోగం చేస్తున్న కట్టాకు ఫోర్జరీలు పెద్ద విషయమేమీ కాదని ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన అతని నియామకం సమయంలో కొందరు కీలక ఉద్యోగులు విష్ణువర్ధన్‌కు సహకరించారని తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సర్వీసు రికార్డును ఇంతకాలం వీసమెత్తు అనుమానం రాకుండా ఉందని విమర్శిస్తున్నారు.

ఆ సంతకం నాది కాదు

విష్ణువర్ధన్ విద్యార్హతల వివాదం చాలాకాలంగా కొనసాగుతోంది. ఆయన తన సర్వీసులో ఏనాడూ నా వద్ద పనిచేయలేదు. కానీ.. అతని సర్వీసు రికార్డు బుక్‌లో నా సంతకం ఉండటం ఆశ్చర్యానికి గురిచేసింది. నూటికి నూరుపాళ్లు అది నా సంతకం కానే కాదు.
– రవి కుమార్, విశ్రాంత పీఆర్ ఇంజినీర్

ఉపాధి కూలీలకు తీపి కబురు

- పెరిగిన కూలి రేట్లు
- ఏప్రిల్ ఒకటి నుంచి అమలు
- జిల్లాలో 1,51,463 మందికి లబ్ధి

జిల్లా సమాచారం

జాబ్‌కార్డులు	1,08,924
మొత్తం కూలీలు	1,51,463
రోజూ హాజరవుతున్నవారు	21,893
గుర్తించిన పనులు	13,000
వ్యయం(రూ.లక్షల్లో)	5944.92



తిమ్మాపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జగిత్యాలరూరల్: ఉపాధిహామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. గతంలో ఉన్న కూలి రెట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2023–24 సంవత్సరానికి వేతనాలు పెంచుతూ ఇటీవల పార్లమెంట్‌స్థాయీ సంఘం సమర్పించిన నివేదిక ఆమోదించింది. దీనిపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నోటిఫికేషన్ జారీచేసింది.

1,51,463మందికి లబ్ధి..

- జిల్లాలో ఉపాధిహామీ పథకంలో 1,08,924 జాబ్‌కార్డులు ఉండగా 1,51,463 మంది కూలీలు ఉన్నారు.
- ఉపాధిహామీ కూలీలకు ప్రస్తుతం రూ.257 దినసరి కూలి చెల్లిస్తున్నారు.
- కేంద్ర ప్రభుత్వం కూలీ రోజు వేతనం రూ.272కు పెంచింది.
- పెంచిన వేతనం ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి వస్తుంది.
- జిల్లాలో రూ.5,944.92 లక్షలు వెచ్చించి సుమారు 13 వేల పనులు చేపట్టేందుకు ఆమోదం లభించింది.

రోజూ 21వేల మంది హాజరు..

జిల్లావ్యాప్తంగా ఉపాధిహామీలో గతంలో రోజూ 15వేల– 18 వేల మంది కూలీలు పనిచేసేవారు. ప్రస్తుతం రోజుకు 21,893 మంది పనులకు వస్తున్నారు. వీరిరాకతో గ్రామాల్లో పనులు భారీగా కొనసాగుతున్నాయి.

ఆదేశాలు రాగానే అమలు

ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీలకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం దినసరి కూలి పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఏప్రిల్ ఒకటి నుంచి పెరిగిన కూలి అందజేస్తాం.
– లక్ష్మీనారాయణ, డీఆర్డీఏ పీడీ, జగిత్యాల

గాంధీ కుటుంబాన్ని వేధిస్తున్నారు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కోరుట్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గాంధీ, నెహ్రూ కుటుంబాలను వేధిస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక స్థానిక కొత్తబస్టాండ్ వద్ద చేపట్టిన నిరసన దీక్ష శిబిరంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంద్కన్నారు. సీపీఐ నాయకులు చెన్నా విశ్వనాథం, సుతారి రాములు సంఘీభావం తెలిపారు. నాయకులు జువ్వాడి కృష్ణారావు, తిరుమల గంగాధరగౌడ్, కొంతం రాజం, అంజిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పోతుగంటి శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

తాగునీరు అందించాలి

జగిత్యాలరూరల్: డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు తాగునీరు సరఫరా చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నర్సింగాపూర్‌లోని డబుల్‌బెడ్రూమ్ ఇళ్లను ఆయన పరిశీలించారు. వీధిదీపాలు వెలిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

రైతులను ఆదుకోవాలి

మల్లాపూర్(కోరుట్ల): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జీవన్‌రెడ్డి కోరారు. ముత్యంపేట, మొగిలిపేటలో ఆయన పర్యటించారు. పలువురిని పరామర్శించారు.

పన్ను చెల్లించకుంటే ఆస్తి జప్తు!

- రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు
- బల్దియాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టిన అధికార యంత్రాంగం
- నిర్దేశిత లక్ష్య సాధనకు ప్రత్యేక కార్యాచరణ అమలు



జగిత్యాలలో దుకాణం సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జగిత్యాల: జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఈనెల 31తో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. అయినా, నిర్దేశిత లక్ష్యం సాధించడంలేదు. కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ బల్దియాల్లో ఆస్తిపన్ను వసూలు బాగానే ఉన్నా.. జిల్లాలోనే అతిపెద్ద మున్సిపాలిటీ జగిత్యాల అట్టడుగు స్థానంలో ఉండడం విస్మయం కలిగిస్తోంది.

అధికారుల తంటాలు..

ఆర్థిక సంవత్సరం గడువు ముంచుకొస్తున్న కొద్దీ ఆస్తి పన్ను వసూళ్ల కోసం మున్సిపల్ అధికారులు నానాతంటాలు పడుతున్నారు. ముఖ్యంగా జగిత్యాల బల్దియా అధికారులు ఉదయం నుంచే ఆయా వార్డుల్లో పర్యటిస్తున్నారు. గల్లీల్లో నివాసాలు, వాణిజ్య, వ్యాపార సముదాయాల యజమానులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆస్తిపన్ను, బకాయిలు స్వచ్ఛందంగా చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. కొన్నిచోట్ల ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్నులను ముక్కుపిండి వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మొండిబకాయిలు ఉన్న దుకాణాలను సీజ్ చేస్తున్నారు. వందశాతం ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

సంవత్సరాలకొద్దీ పెండింగ్..

కోరుట్ల, మెట్‌పల్లితోపాటు చిన్నమున్సిపాలిటీలు రాయికల్, ధర్మపురిలో ఆస్తిపన్ను వసూలు ఆశించిన స్థాయిలో సాగుతోంది. కానీ, అతిపెద్ద బల్దియా జగిత్యాలలోనే 68.5 శాతానికి పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. మున్సిపల్ కమిషనర్ నరేశ్ ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటా పర్యటిస్తూ ఆస్తి పన్ను చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. గతంలో ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 90 శాతానికి మించి ఆస్తిపన్ను వసూలయ్యేది. ఈసారి చైర్‌పర్సన్ రాజీనామా చేయడం, తరచూ మున్సిపల్ కమిషనర్లు బదిలీపై వెళ్లడం, పాలన అస్తవ్యస్తంగా మారడంతో అధికారులు నిర్దేశిత లక్ష్యం చేరుకోవడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి.

ఆస్తిపన్ను వసూళ్ల తీరు(రూ.కోట్లలో)

బల్దియా	డిమాండ్	వసూలైంది	శాతం
జగిత్యాల	12.40	6.90	68.5
కోరుట్ల	617.13	400.01	64.82
మెట్‌పల్లి	261.0	225.0	86.1
ధర్మపురి	0.85	0.56.46	63
రాయికల్	1.02	0.81.56	79.86

లక్ష్యం చేరుకుంటాం



“ జగిత్యాల మున్సిపల్‌లో వందశాతం ఆస్తి పన్ను వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అత్యధికంగా పెండింగ్‌లో ఉన్న వారి ఆస్తి పన్ను సైతం కట్టిస్తున్నాం. ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలి.
– నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల ”

ఆస్తులు జప్తు చేస్తున్న అధికారులు

జగిత్యాల మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిలు సుమారు రూ.2కోట్ల వరకు చేరాయి. వీటి వసూలు కోసం అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఏకంగా మూడు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి మొండిబకాయిదారులను గుర్తిస్తున్నారు. తొలుత ఆస్తిపన్ను చెల్లించే నోటీసులు జారీచేస్తున్నారు. అయినా, స్పందన లేనివారి ఆస్తులు జప్తు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు ముగ్గురి ఆస్తులు సీజ్ చేశారు. ఆస్తుల తాలూకు సామగ్రిని ట్రాక్టర్ల ద్వారా బల్దియాకు తరలిస్తున్నారు.

క్లుప్తంగా

'ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు'


డా. నగేష్

వెల్గటూర్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. కె నగేష్ అన్నారు. మంగళవారం ఉస్మానియా ఆసుపత్రి సందర్శనకు వెళ్తున్న వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారందరిపై కక్షగట్టి అరెస్టు చేస్తున్నారని, తెలంగాణలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలను అణిచివేసే కుట్ర జరుగుతోందని, ప్రతిపక్షాలపై నిర్బంధ కాండ కొనసాగుతోందన్నారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని, ప్రతిపక్షాల గొంతు నొక్కాలనుకోవడం దుర్మార్గమన్నారు. కేంద్రం ఈడీ కేసులో కేసీఆర్ కూతురును విచారణకు పిలిస్తే మహిళలను వేధిస్తున్నారని నానాయాగీచేస్తున్న కేసీఆర్‌కు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుందనే కారణంతో షర్మిలను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని ప్రతిపక్షాలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు.

అంజన్న గుట్టపై రాత్రివేళల్లో ఈవో పర్యవేక్షణ


ఆలయ పరిసరాలను పర్యవేక్షిస్తున్న ఈవో

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో రాత్రివేళ విధులు నిర్వహించే పోలీసులు ఉద్యోగులను, ఆలయ పరిసరాలను ఈవో వెంకటేశ్ సోమవారం రాత్రి తిరిగి పర్యవేక్షించారు వారితో పాటు భక్తులను సైతం సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. వైజంక్షన్ వద్ద బిక్షాటకులు మధ్య గొడవ జరిగితే ఈవో అక్కడికి వెళ్లి విధుల్లో ఉన్న హోంగార్డులకు తెలిపేవరకు వారు దృష్టి సారించలేదు. దీంతో హోంగార్డులు పోలీసులపై ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ బిక్షాటకులను అక్కడి పోలీసులు అదుపు చేయకపోవడంతో వెనుతిరిగారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ స్పందించి కొండగట్టు ఆలయంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేయడంతో పాటు రాత్రివేళ్లలో ఎస్సై సైతం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ పరిసరాలను పోలీసుల విధులను పర్యవేక్షించేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

కోనరావుపేట: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం దత్తత ఆలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు, శ్రీరామనవమి వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో ఈనెల 29న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 30న సీతారాముల కల్యాణం, ఏప్రిల్ 6న స్వామివారి రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లలో భాగంగా ప్రధాన ఆలయం, కల్యాణ వేదికకు రంగులు వేస్తున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి చలువ పందిళ్లు వేస్తున్నారు. కల్యాణానికి వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతున్నారు. మర్తనపేట, ధర్మారం, కోనరావుపేట, నిమ్మపల్లి గ్రామాల్లో శ్రీరామ నవమి ఏర్పాట్లు చేస్తున్నారు. కనగర్తిలో నూతనంగా స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సందిగ్ధంలో మామిడి కొనుగోళ్లు

- ఓపెన్ మార్కెటా...కమీషన్ మార్కెటా..
- ఎటూ తేల్చని మార్కెట్ అధికారులు... ఆందోళనలో రైతులు


చల్‌గల్‌లోని మామిడి మార్కెట్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల(చల్‌గల్)లోని మామిడి మార్కెట్‌లో గత కొన్నేళ్లుగా మామిడి కాయల కొనుగోళ్లు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. మరో వారం రోజుల్లో మామిడి కాయల కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ, మార్కెట్ అధికారులు కాని, పాలకపక్షం కాని ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అంతా గందరగోళంగా మారింది. ఇక్కడ కొనుగోలు చేసిన మామిడికాయలను ఢిల్లీ, నాగ్‌పూర్, జమ్మూ, కాశ్మీర్, చండీఘడ్, హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ మేరకు మామిడి మార్కెట్‌లో దాదాపు రూ. 200 కోట్ల మేర మామిడి వ్యాపారం సాగుతుంది. ఈ నేపథ్యంలో మామిడి వ్యాపారులు సైతం పాత లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవడం, కొత్తగా దుకాణాలు పెట్టి వారు లైసెన్స్‌లు పొందుతున్నారు. అయితే, గత కొన్నేళ్లుగా కమీషన్ పద్ధతిలో చేపడుతున్న కొనుగోళ్లు, ఈసారి ఓపెన్ పద్ధతిలో చేపడితే, మంచి ధర వస్తుందని రైతులు పట్టుబడుతున్నారు. అయితే, ఈ విషయంపై ఎటు తేల్చుకోలేక అధికారులు, మార్కెట్ పాలకవర్గం మల్లాగుల్లాలు పడుతోంది.

ఇప్పటి వరకు కమీషన్ పద్ధతిలో ఇలా..

వ్యవసాయ మార్కెట్ నుంచి మామిడికాయల కొనుగోలుకు లైసెన్స్ తీసుకున్న వ్యాపారులు మామిడి మార్కెట్లో దుకాణాలు ఏర్పాటుచేసుకుంటారు. రైతులు తాము పండించిన మామిడి కాయల రకాలను తెచ్చి వ్యాపారులకు చూపిస్తే, వారు ధర నిర్ణయిస్తారు. కాయలు, రేటు నచ్చితే అక్కడే తూకం వేయిస్తారు. అయితే, ఈ పద్ధతిలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వ్యాపారులు ఇష్టారీతిన ధర నిర్ణయిస్తుండడంతో తమకు అన్యాయం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత శాంపిల్ తెచ్చి కాయలకు ఓ రేటు చెప్పి.. తీరా మార్కెట్‌కు తెచ్చిన తర్వాత కాయ బాగా లేదంటూ రేటు తగ్గిస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు, సూట్, రాట్, క్యాష్‌కటింగ్ అంటూ తమను వ్యాపారులు దోచుకుంటున్నారని రైతులు అంటున్నారు.

ఓపెన్ మార్కెట్ అయితే ఇలా..

ఓపెన్ మార్కెట్ అయితే రైతులు తొలుత ఏ వ్యాపారిని సంప్రదించాల్సిన అవసరం ఉండదు. మామిడి కాయలు తెంపుకుని మార్కెట్‌కు వచ్చి, కుప్పలు పోస్తే, లైసెన్స్ పొందిన వ్యాపారులు వచ్చి, మార్కెట్ అధికారుల సమక్షంలో కాయ నాణ్యతను బట్టి రేటు నిర్ణయిస్తారు. అప్పుడు, వ్యాపారుల్లో పోటీ పెరిగి రేటు ఎక్కువ వస్తుందని రైతులు అంటున్నారు. ఓపెన్ యాక్షన్‌లో ఢిల్లీ వంటి ఇతర రాష్ట్రాల వ్యాపారులు సైతం పాల్గొంటే రైతులకు మరింత రేటు వస్తుంది. ఓపెన్ యాక్షన్‌లో కొనుగోలు చేసిన కాయలు ఎగుమతి చేస్తున్న సమయంలో పాడైపోయి నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం 4 శాతం కమీషన్ తీసుకుంటే రైతులకు ఎక్కువ నష్టం వస్తుందని అంటున్నారు.

మార్కెట్ అధికారుల మౌనం..

మార్కెట్ నిబంధనల మేరకు మామిడి కొనుగోళ్లను ఓపెన్ పద్ధతిలో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే, వ్యాపారుల్లో కొంతమంది ఓపెన్ మార్కెట్‌ను బలపరుస్తుండగా, మరికొందరు కమీషన్ మార్కెట్‌ను బలపరుస్తున్నారు. మామిడి మార్కెట్ ప్రారంభంలో, మామిడి కాయ ఎక్కువగా లేకపోవడంతో, మామిడి మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కమీషన్ ప్రతిపాదికన కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చారు. అదేపద్ధతి ప్రస్తుతం కొనసాగుతోంది. ప్రస్తుతం లోకల్ వ్యాపారులే మామిడి కాయలను కొనుగులు చేసి ఇతర ప్రాంతాల వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలన్నదానిపై ఇటు మార్కెట్ అధికారులు, అటు అధికార పక్షం అవగాహనకు రాలేకపోతున్నారు. ఇందుకోసం, అభ్యుదయ రైతులు, వ్యాపారులు, మార్కెట్ అధికారులు, మార్కెట్ పాలకవర్గం, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో వెంటనే సమావేశం ఏర్పాటు చేసి మామిడి కొనుగోళ్లపై సమీక్షాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిబంధనలు అమలు చేయాలి



మామిడి మార్కెట్లో నిబంధనలు ఖచ్చితంగా అమలుచేయాలి. ఇష్టారీతిన కొనుగోళ్లు చేస్తుండడంతో ఇటు రైతులు, అటు మార్కెట్‌కు ఆదాయం రావడం లేదు. అవసరమైతే ఇతర పండ్ల మార్కెట్‌లను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలి.

– శ్రీపాల్‌రెడ్డి, మామిడి రైతుల సంఘం అధ్యక్షుడు, జగిత్యాల

నిర్ణయం తీసుకోవాలి



ఓపెన్ మార్కెట్ పద్ధతా లేదా కమీషన్ పద్ధతా అనే విషయంపై మార్కెట్ అధికారులు నిర్ణయం తీసుకోవాలి. రైతులకు, వ్యాపారులకు నష్టం లేకుండా మార్కెట్‌కు ఆదాయం వచ్చేలా నిర్ణయాలు ఉండాలి.

– ఎండీ. మోయిన్, మామిడి వ్యాపారుల సంఘం మాజీ అధ్యక్షుడు, జగిత్యాల

సమావేశాలు నిర్వహిస్తాం



ఇప్పటికే ఓసారి వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాం. మరోసారి మామిడి రైతులు, వ్యాపారులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి సమావేశాలు నిర్వహిస్తాం. త్వరలో ప్రారంభించే మామిడి మార్కెట్‌లో కొనుగోళ్లపై త్వరలో ఓ నిర్ణయానికి వస్తాం.

– నక్కల రాధ, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్, జగిత్యాల

ఆగని వడ్డీ వ్యాపారం

- జిల్లాలో యథేచ్ఛగా చిట్టీల దందా
- రాజకీయ పలుకుబడితో జోరుగా వ్యాపారాలు
- వివిధ పదవుల్లో ఉన్నవారికీ అండదండలు



కోరుట్ల: జిల్లాలో అడ్డగోలుగా సాగుతున్న వడ్డీ వ్యాపారం నియంత్రణకు పోలీసులు ఆరు నెలలకోసారి వ్యాపారులపై దాడులు చేస్తూనే ఉన్నారు. అయినా, దందాకు అడ్డుకట్ట పడటంలేదు. తనిఖీలు, దాడులకు భయపడి సాధారణ వడ్డీ వ్యాపారులు అక్రమ వ్యాపారాలకు క్రమంగా దూరమవుతున్నారు. కానీ, రాజకీయ పలుకుబడి ఉండి, వివిధ పదవుల్లో ఉన్నవారు ఆర్బీఐ నుంచి లైసెన్స్‌లు లేకుండా వడ్డీ వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తూ చిట్‌ఫండ్‌లు నిర్వహిస్తున్నారు. అక్రమార్కులకు రాజకీయ పలుకుబడి ఉండడంతో వారిపై ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఒకవేళ ధైర్యంతో ఫిర్యాదు చేసినా ఫలితం ఉండదనే ఉద్దేశంతో అడిగినంత వడ్డీ చెల్లిస్తూ బాధితులు సమస్యల పాలవుతున్నారు.

దాడులతో నియంత్రణ..

- నాలుగేళ్లుగా ఏటా ఒకట్రెండుసార్లు జిల్లాలోని వడ్డీ వ్యాపారుల వివరాలపై ఆరా తీస్తున్న పోలీసులు.. అక్రమాల చాట్టా తేల్చేందుకు దాడులు చేస్తున్నారు. తద్వారా అడ్డగోలుగా వడ్డీ వ్యాపారాన్ని చాలామటుకు నియంత్రించారు.
- అతికీలక పట్టణాలు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో సుమారు 120 మంది వడ్డీ వ్యాపారులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.
- లెక్కల్లోకి రాని రూ.లక్షల నగదు, ప్రామిసరీ నోట్లు, చెక్కులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నాలుగేళ్ల వ్యవధిలో లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్న వడ్డీ వ్యాపారుల అడ్డగోలు దందాకు చెక్ పెట్టడంతో మనీ లెండింగ్ లైసెన్స్‌లు జారీచేడాన్ని రెవెన్యూ అధికారులు కూడా నిలిపేశారు. ఫలితంగా సాధారణ వడ్డీ వ్యాపారుల దందా నియంత్రణలోకి వచ్చింది.

రాజకీయం మాటున..

సాధారణ వడ్డీ వ్యాపారుల నియంత్రణకు నిక్కచ్చిగా చర్యలు చేపట్టిన పోలీసులు.. రాజకీయం మాటున వడ్డీ వ్యాపారం, చిట్టీల దందా సాగిస్తున్న వారిని నియంత్రించడంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఓ వైపు ఆరు నెలలకోసారి పోలీసుల దాడులు కొనసాగుతున్నా.. మరోవైపు రాజకీయంగా పలుకుబడి, పదవుల్లో ఉన్నకొందరు జోరుగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. జగిత్యాలలో 12 మంది, కోరుట్లలో పది మంది, మెట్‌పల్లిలో ఆరుగురు రాజకీయ పరపతి, పదవుల మాటున వడ్డీ వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. కేవలం వడ్డీ వ్యాపారం మాత్రమే కాకుండా అనుమతులు లేని చిట్టీలు, ఇళ్లు, ఇళ్లస్థలాల కాగితాలు తాకట్టు పెట్టుకోవడం, మార్ట్‌గేజ్ పెట్టుకోవడం వంటి దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇలా దందాను సాగిస్తున్న వారిని నియంత్రిచడంలో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నట్లు విమర్శలున్నాయి.

ఫిర్యాదులు చేస్తే చర్యలు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోరుట్ల, మెట్‌పల్లి పరిసరాల్లో ఇప్పటికే చాలావరకు వడ్డీ వ్యాపారులను నియంత్రించాం. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వడ్డీ వ్యాపారాలు సాగిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. వారిపై ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

ఆగని టీచకపర్వం!

- సిబ్బంది నుంచి లేఖల కోసం బలవంతం
- వీడియోలు విడుదలైనా.. కాపాడేందుకు నేతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల మోడల్ స్కూల్ మాజీ ప్రిన్సి పాల్ శ్రీనివాస్ సస్పెండ్ అయినా.. తాను ఉత్తముడి ని అంటూ నిరూపించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఉన్న శ్రీనివాస్ మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోలు విడుదలయ్యాయి. తమ ను పదేపదే వేధిస్తున్న శ్రీనివాస్ బండారాన్ని లోకా నికి తెలిపేందుకు తోటి ఉద్యోగులే రహస్యంగా వీడియోలు తీశారు. ఈ వీడియోలు 'సాక్షి'కి చేరడంతో వెంటనే కలెక్టర్ యాస్మిన్ బాషాకు చేరవేసింది. వీడియోలో శ్రీనివాస్ చర్యలు చూసి మండిపడ్డ కలెక్టర్ అతన్ని ఈనెల 16వ తేదీన సస్పెండ్ చేసిన విషయం విదితమే.

నేడు స్కూలుకు విచారణ కమిటీ..!

ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు బుధవారం విచారణ కమిటీ స్కూలుకు రానుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సస్పెండ్ అయిన శ్రీనివాస్ తాను ఉత్తముడని చెప్పుకునేందుకు ముందే ప్లాన్ వేశారు. మహిళా సిబ్బంది వద్దకు వెళ్లి.. శ్రీనివాస్ మంచోడు అంటూ స్వచ్ఛందంగా రాసి ఇచ్చినట్లుగా ముందే రాసిన లేఖలు వారికి ఇచ్చి వాటిపై సంతకా లు చేయించేందుకు యత్నించారు. ఈ ఘన కార్యానికి ఓ మహిళా ఉద్యోగి నేతృత్వం వహిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. పర్మినెంట్ ఉద్యోగులంతా ఆ లేఖలపై సంతకాలు చేయకుండా సున్నితంగా తిరస్కరించారు. అయినా.. పట్టువదలకుండా తాత్కాలిక సిబ్బందితో అవే లేఖలపై సంతకాలు చేయించుకున్నారని సమాచారం. ఈ లేఖలను బుధవారం స్కూల్‌కు విచారణకు వచ్చే కమిటీకి అందజేసేలా ప్లాన్ వేశారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. అదే సమయంలో విచారణ కమిటీతో నిందితుడు శ్రీనివాస్ కూడా రానున్నట్లు తెలిసి సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అతను ఎదురుగా ఉంటే విచారణ పారదర్శకంగా ఎలా జరుగుతుందన్న సందేహాలు లేవనెత్తుతున్నారు. మరో ఆసక్తికరమైన అంశమేంటంటే.. శ్రీనివాస్ ఉత్తముడు అంటూ లేఖలపై సంతకాలు పెట్టాల్సిందిగా ఓ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, మరో నలుగురైదుగురు చోటా లీడర్లు స్కూలు సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తుండటాన్ని వారంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

మల్లాపూర్: వీధి కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతిచెందగా, మరో 6 గొర్రెలు తీవ్రంగా గాయపడిన ఘటన మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రొడ్డ సురేశ్‌కి చెందిన గొర్రెలను సోమవారం మేపి పాకలోకి తోలాడు. రాత్రి వీధికుక్కలు దాడిచేయగా 12 గొర్రెలు మృతి చెందాయి. మరో 6 గొర్రెలు తీవ్రంగా గాయాపడ్డాయి. విషయం తెలుసుకున్న పశు వైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఘటనస్థలికి వెళ్లి పరిశీలించి పంచానామా చేసి గాయపడ్డ గొర్రెలకు చికిత్స అందించారు. బాధితుడికి సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

పరిహారం చెల్లించాలి..

గొర్రెల మృతితో తీవ్రంగా నష్టపోయిన సురేశ్‌కు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఘటనస్థలికి వెళ్లి పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, సర్పంచ్ బొల్లం కృష్ణవేణి, ఉపసర్పంచ్ అల్లూరి మహేశ్‌రెడ్డి, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, నాయకులు బొల్లం గంగాధర్, దొడె గంగనర్సయ్య, బొల్లం పవన్‌లు పరామర్శించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేందుకు కృషిచేయనున్నట్లు తెలిపారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

- 4 తులాలు బంగారు ఆభరణాలు అపహరణ

ధర్మపురి: దైవదర్శనానికి వేములవాడ వెళ్లిన ఓ దంపతుల ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళాలు పగులగొట్టి డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉన్న బంగారు నెక్లెస్‌ను దోచుకెళ్లిన ఘటన దమ్మన్నపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని దమ్మన్నపేటకు చెందిన తోడేటి శేఖర్ తన భార్య పిల్లలతో సోమవారం వేములవాడ రాజన్న ఆలయానికి వెళ్లారు. అదేరోజు రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉన్న 4 తులాల బంగారు నెక్లెస్‌ను దోచుకెళ్లారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఇంటితాళాలు పగులగొట్టినట్లు బంధువులు అందించిన సమాచారంతో ఘటనా స్థలానికి ఎస్సైలు కిరణ్‌కుమార్, రామకృష్ణ వెళ్లి పరిశీలించారు. ఈ విషయాన్ని నరేష్‌కు తెలపడంతో హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో దాచిన బంగారం పోయిందని నగదు అలాగు ఉందని పోలీసులకు తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాలకు చెందిన క్లూస్ టీం చోరీ జరిగిన ఇంటికి వెళ్లి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.


జాగిలాలతో దర్యాప్తు చేస్తున్న నిపుణులు

అన్నదమ్ముళపై కత్తితో దాడి

ఇద్దరికి తీవ్ర గాయాలు..ఆస్పత్రికి తరలింపు

మల్యాల(చొప్పదండి): ఓ యువకుడు అన్నదమ్ములిద్దరిపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మల్యాల మండలం బల్వంతాపూర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బల్వంతాపూర్‌లోని మిడిదొడ్డి హరీశ్ అదే గ్రామానికి చెందిన ఎండీ.ఇబ్రహీంతో మంగళవారం మధ్యాహ్నం గొడవ జరిగినట్లు గ్రామంలో ప్రచారం జరిగింది. ఈ క్రమంలో సాయంత్రం ఇబ్రహీంపై దాడిచేసేందుకు ఇంటికి వెళ్లగా, ఇబ్రహీం ఇంట్లో లేకపోవడంతో అతడి తండ్రిపై కత్తితో దాడిచేస్తుండగా అక్కడే ఉన్న దస్తగిరి తమ్ముడు ముల్లా, హరీశ్‌ను అడ్డుకునేందుకు యత్నించాడు. దీంతో అతడిపై కత్తితో దాడిచేసినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, యువకుడు హరీశ్ పారిపోయాడు. స్థానికులు బాధితులను ఆస్పత్రికి తరలించారు. దస్తగిరి గతంలో మంత్రాల నేపంతో వృద్ధురాలిపై దాడిచేసిన ఘటనలో హత్యాయత్నం కేసులో జైలుపాలై బెయిల్‌పై బయటికి వచ్చాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి జిల్లా ఎస్పీ భాస్కర్ ఆధ్వర్యంలో బల్వంతాపూర్‌లో మూఢనమ్మకాల నివారణపై అవగాహన కల్పించిన మరుసటి రోజే దస్తగిరి కత్తిపోట్లకు గురికావడం కలకలం రేపింది.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


గంగవ్వ(ఫైల్)

బుగ్గారం(ధర్మపురి): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ నన్నవేణి గంగవ్వ(45) మంగళవారం వడదెబ్బతో మృతి చెందింది. గంగవ్వ కొన్నేళ్లుగా ఉపాధిహామీ పనులకు వెళ్తోంది. రోజూ మాదిరిగానే మంగళవారం గ్రామశివారు గుట్ట సమీపంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలింది. సమాచారం అందుకున్న గంగవ్వ కుమారుడు ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే గంగవ్వ మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త ఉపాధి కోసం బెహరాన్ వెళ్లాడు. అతడికి ఈ సమాచారం చేరవేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల కొత్త బస్టాండ్ సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన సీహెచ్. రమేశ్, రాజు అనే ఇద్దరు కొత్తబస్టాండ్ మీదుగా బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించగా సిబ్బంది అనిల్, పెద్ది శ్రీని వాస్‌లు బాధితులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ పంపించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

సిరిసిల్లటౌన్: అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బల్ల రాజమ్మ ఇద్దరు కొడుకులు రాజేశ్, రాజుతో పాటు ఉంటోంది. మొదటి అంతస్తులో పెద్దకొడుకు రాజేశ్‌తో ఉంటుండగా.. కింది అంతస్తులో చిన్నకొడుకు రాజు నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి రెండో అంతస్తుకు వెళ్లిన రాజమ్మ కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు టౌన్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

దళారీ దగా..!

- సౌదీలో నిర్బాకం
- జైలులో చిట్టాపూర్‌వాసులు


చిట్టాపూర్‌కు చెందిన జోగ ఆనంద్ భార్య, పిల్లలు

కోరుట్ల/మల్లాపూర్: దళారీ దగా.. పనికి సంబంధించిన వీసా పర్మిట్ లేనిఫలితంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఆరుగురు సౌదీలో జైలుపాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన జోగ ఆనంద్(42), జోగ రాజు(35), వీరవత్తిని శ్రీనివాస్(45), అరిసెల్ల గోపీ(35), కటుకం రాజ్‌కుమార్(32)తోపాటు మరో యువకుడు ఏడాది క్రితం ఆజాద్ వీసాలతో సౌదీ వెళ్లారు. డ్రైవర్ పని వీసాలతో అక్కడికి వెళ్లిన వీరు.. టైలరింగ్, క్లీనింగ్ వంటి పనుల్లో చేరి ఉపాధి పొందుతున్నారు. సౌదీ పోలీసులు వీసా ప్రకారం పనిలో లేనివారిని తిరిగి స్వదేశాలకు పంపుతున్న క్రమంలో చిట్టాపూర్ యువకులు అక్కడ పోలీసులకు దళారీగా పనిచేసే వ్యక్తి దృష్టికి వచ్చినట్లు సమాచారం. సదరు దళారీ వీసాలో లేనిపనులు ఎలా చేస్తున్నారని, పోలీసులకు పట్టిస్తానని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో చిట్టాపూర్ యువకులు భయపడి సదరు దళారీకి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఇచ్చి తమ సమాచారం పోలీసులకు ఇవ్వవద్దని బతిమిలాడినట్లు తెలిసింది. అయినప్పటికీ దళారీ మళ్లీ రూ.10 లక్షలు ఇవ్వాలని బెదిరించడంతో అంతడబ్బు తమవద్ద లేదని బాధిత యువకులు నిరాకరించినట్లు సమాచారం. ఈ క్రమంలో దళారీ వీరి చిరునామాను అక్కడి పోలీసులకు అందించడంతో సోమవారం యువకులను వీరిని అరెస్టు చేసినట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం అరెస్ట్ సమాచారం స్థానికంగా తెలియడంతో యువకుల బంధువులు తమవారు ఎలా ఉన్నారోనని ఆందోళన చెందుతున్నారు. జైలులో ఉన్నట్లుగా చెబుతున్న చిట్టాపూర్ గ్రామానికి చెందిన జోగ ఆనంద్ భార్య సుజాత మాట్లాడుతూ, తన భర్తను జైలు నుంచి విడిపించి ఇండియాకు వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రోదిస్తూ చెప్పింది. సౌదీ పోలీసులు వీసా పర్మిట్ ప్రకారం పనుల్లో లేనివారిని గుర్తించి అరెస్టు చేసి మరోసారి సౌదీకి రాకుండా బ్యాన్ విధించి వారివారి స్వస్థలాలకు పంపుతున్నట్లు తెలిసింది.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

జగిత్యాలరూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. తక్కళ్లపల్లిలో చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. కంటి జబ్బులు ఉన్నవారిని గుర్తించి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మకరంద్, జిల్లా వైద్యాధికారి శ్రీధర్, తహసీల్దార్ నవీన్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, సర్పంచ్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా →

